సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిగా ఫర్హీన్ కౌసర్



సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిగా ఫర్హీన్ కౌసర్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఫర్హీన్ 2016లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. మెదక్, మహేశ్వరం, సిటీ సివిల్ కోర్టులలో పనిచేసి ఇదే సంవత్సరం తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీపై వచ్చారు. ఇటీవలే సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది సూర్యాపేటలో నియామకమయ్యారు. ఇప్పటి వరకు సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన పి.శ్రీవాణి సూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఫర్హీన్ కౌసర్ గురువారం శ్రీవాణి నుంచి సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలను స్వీకరించారు.

ఉచిత న్యాయ సహాయానికి టోల్ ఫ్రీ నెంబరు

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఉచిత న్యాయ సహాయం, సలహాలకు న్యాయసేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోవచ్చని సూర్యాపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి తెలిపారు. సూర్యాపేటలో ఆ సంస్థ ఏర్పడ్డ తర్వాత తొలిసారిగా కార్యదర్శి నియామకం చేస్తూ ఇటీవల రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జి సంస్థ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కోర్టుల ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థకు శాశ్వత భవనం సమకూరడంతో కార్యదర్శిగా శ్రీవాణి నియమితులయ్యారు. ఆమె గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి సూచనల మేరకు సంస్థ ఇతర సిబ్బందితో కలిసి ఉచిత న్యాయసహాయం, సలహాలకు టోల్‌ఫ్రీ నెంబరు గోడ పత్రికను కార్యదర్శి శ్రీవాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరూ 15100 నెంబరుకు ఫోన్‌చేసి ఉచిత న్యాయ సహాయం, సలహాలు పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సంస్థ కార్యదర్శి, తదితరులు

27న ఉమ్మడి జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

మునగాల, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాపోటీలను ఈనెల 27న కోదాడ పట్టణంలోని సీసీరెడ్డి హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆజాంబాబా గురువారం తెలిపారు. బాస్కెట్‌బాల్ క్రీడలు అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



మఠంపల్లి, న్యూస్‌టుడే: చెన్నైలో ఈనెల 30న జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మఠంపల్లికి చెందిన **ముల్కలపల్లి గురుమూర్తి** ఎంపికైనట్లు శిక్షకుడు వై.సతీష్ గురువారం తెలిపారు. నల్గొండ అన్నెపర్తిలోని ఎంజీయూలో 23న జరిగిన సౌత్ జోన్ పోటీల్లో ప్రతిభ చాటిన గురుమూర్తి చెన్నైలోని వెల్మసింగ్ స్టేడియంలో జరిగే పోటీలలో పాల్గొంటున్నట్లు ఆయన చెప్పారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. గురుమూర్తి నల్గొండ ఎన్‌జీ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాడు.

ద్విచక్ర వాహనంపై నుంచి జారి పడి మహిళ మృతి

మునగాల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపైనుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని కొక్కిరేణి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన గుండు లక్ష్మి(55) మునగాల మండలంలోని భవానిగూడెంలో కుమారుడు రవితో కలిసి గత కొన్ని సంవత్సరాలుగా ఉంటున్నారు. వెలిదండ గ్రామంలో పింఛను తీసుకోవడానికి మండల కేంద్రంలో ఓ ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి వాహనంపై వెళ్తున్నారు. కొక్కిరేణి గ్రామ శివారుకు రాగానే రోడ్డుపై వీధి కుక్కలు అడ్డు రావడంతో వాహనదారుడు ఒక్క సారిగా బ్రేకు వేశారు. దీంతో ఆమె జారి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలు కాగా కొక్కిరేణిలోని వైద్యశాలకు, తరువాత కోదాడలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల నిమిత్తం నార్కెట్‌పల్లిలోని కామినేనికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పేదరిక నిర్మూలనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, రచయితలు, కళాకారులు భాగస్వాములు కావాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో గురువారం భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని.. భవిష్యత్తు మహిళా సాధికారతపైనే ఆధారపడి ఉందని చెప్పారు. వైద్యారోగ్యం, విద్యారంగాలను పరిశీలిస్తే జిల్లా మెరుగైన స్థానంలో ఉందన్నారు. 2024లో పదో తరగతిలో 96.91 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులకు విద్యతోపాటు చేతి వృత్తులను సంబంధించిన వస్తువుల తయారీలో మెలకువలు అందిస్తే మరింత విజ్ఞానవంతులు అవుతారని పేర్కొన్నారు.



సూర్యాపేటలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఘన స్వాగతం

జిల్లాకు వచ్చిన గవర్నర్‌కు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, అధికారులు ఘన స్వాగతం పలికారు. తొలుత రాష్ట్ర గవర్నర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన జిల్లా అధికారులు, ప్రముఖులు ముఖాముఖిలో పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా ప్రాముఖ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు తెలియజేశారు. పలువురు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి పురపాలిక ఛైర్‌పర్సన్లు పెరుమాళ్ల అన్నపూర్ణ, గెల్లి అర్చన, అనసూయ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం:

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వానికి అన్ని విషయాలలో చురుకైన సహకారం అందిస్తోందని, ఆహార భద్రతలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల బియ్యం అందజేస్తున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. జనవరి నుంచి సన్న బియ్యాన్ని అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాబోయే రోజుల్లో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని తెలిపారు. సూర్యాపేటకు సంస్కృతి, సంప్రదాయాలతోపాటు చరిత్రాత్మకంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని వెల్లడించారు.




సూర్యాపేటలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం

బీమా.. అన్నదాతకు ధీమా..!

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందివచ్చే తరుణంలో ప్రకృతి విపత్తుల కారణంగా నష్టం జరగడం ఉమ్మడి నల్గొండ జిల్లాలో సర్వసాధారణంగానే మారింది. ఏటా అకాల వర్షాలు, వడగళ్ల వానలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. రూ.వేలు పెట్టుబడి పెట్టి నిరాశకు గురవుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం రైతులను ఆదుకునే క్రమంలో పంటల బీమా అమలు చేయాలని సంకల్పించింది. ఇటువంటి పరిస్థితుల్లో పంటల బీమాను వచ్చే సీజన్ నుంచి ప్రారంభిస్తామని తాజాగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో కర్షకుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం సుమారు 9,08,810 మంది రైతులుండగా, సుమారు 18.08 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగును చేపడుతున్నట్లు అధికారులంటున్నారు.





ప్రయోజనం ఇలా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో అధిక శాతం వ్యవసాయం పైనే ఆధారం. ముఖ్యంగా సింహభాగం రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కందితోపాటు కూరగాయలు సాగు చేపడుతుంటారు. వన్యప్రాణుల బెడదకు తోడు వేలాది ఎకరాల్లో ప్రతిఏటా వడగళ్లు, అకాల వర్షాలు కురిసి ఇక్కడి పంటలకు తీవ్రంగా నష్టం జరగడం పరిపాటి అనే చెప్పవచ్చు. ఇలాంటి తరుణంలో సదరు పంటలకు బీమాతో ప్రయోజనం చేకూరనుందన్నది వాస్తవం. ముఖ్యంగా వడగళ్లు కురిసినా.. వర్షాలు లేక పంటలు ఎండిపోయినా సాగు సమయంలో రైతులు వాటికి బీమా చేసుకుంటే ఉపయోగంగా ఉంటుంది. గతంలో గ్రామం యూనిట్‌గా బీమా చేస్తుండేవారు. దీనివల్ల కర్షకులకు ప్రయోజనం ఉండేది. ఎకరాకు రూ.500 ప్రీమియం చెల్లిస్తే నష్టపోయిన సమయంలో రూ.వేలాదిగా డబ్బులు వస్తుండేవి. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న సమయంలో బీమా ప్రీమియం డబ్బులు తీసుకునేవారు. నష్టపోతే వరికి ఎకరాకు రూ.37,484, పత్తి రూ.38,282, మొక్కజొన్నకు రూ.18,742 పరిహారం వచ్చేది.

పారిశుద్ధ్య విధానం భేష్



జమునానగర్ డంపింగ్ యార్డులో ఎరువుల తయారీ తీరును సందర్శకులకు వివరిస్తున్న సూర్యాపేట పుర కమిషనర్ శ్రీనివాస్

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పారిశుద్ధ్య విధానం అధ్యయనం చేసేందుకు రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశాల మేరకు నల్గొండ పుర కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు గురువారం సూర్యాపేట పురపాలికను సందర్శించారు. పట్టణంలోని బాలెంల, జమునానగర్‌లో గల కంపోస్టు యార్డు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. జమునానగర్‌లోని యార్డులో ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన ఇటుకలు, ఆక్యుప్రెషర్ మ్యాట్ల తయారీ విధానాన్ని కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. అనంతరం సూర్యాపేటలోని పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో తడి, పొడి చెత్త సేకరణ, వర్మీకంపోస్టు చేస్తున్న విధానాన్ని వివరించారు. సూర్యాపేట పురపాలికలో పారిశుద్ధ్య విధానం భేష్‌గా ఉందని సందర్శకులు ప్రశంసించారు. కార్యక్రమంలో కమిషనర్ యూసఫ్, సిబ్బంది దండు శ్రీను, రాందుర్గారెడ్డి, మున్వర్ అలీ, బాలయ్య, భాస్కర్‌రెడ్డి, వీరేంద్ర, డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీపీ సంస్థ శఠగోపం..!

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట కేంద్రంగా నాలుగు నెలలుగా గొలుసుకట్టు దందా నిర్వహించిన ఆర్‌జీపీ మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థ గురువారం బోర్డు తిప్పేసింది. రూ.కోట్ల పెట్టుబడి పెట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ సంస్థ అక్రమాలపై 'రవ్వంత పెట్టుబడి.. కొండంత రాబడి' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంతో మేల్కొన్న బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్‌లోని కార్యాలయం మూత పడటంతోపాటు సంస్థ నిర్వాహకుడు, మునగాల మండలం బరాఖత్‌గూడేనికి చెందిన శంకర్‌రావు కనిపించకుండా పోయాడు. ఆర్‌జీపీ యాప్‌లోని వాలెట్ నుంచి రెండు వారాలుగా డబ్బులు తిరిగి ఖాతాలోకి రాకపోవడంతో మోసపోయినట్లు బాధితులు గుర్తించారు. గురువారం సాయంత్రం నుంచి సూర్యాపేట పట్టణ పోలీసులను బాధితులు పెద్ద సంఖ్యలో ఆశ్రయిస్తున్నారు. కోదాడ, మునగాల, సూర్యాపేట, తిరుమలగిరి, మిర్యాలగూడ, భూదాన్‌పోచంపల్లి, నకిరేకల్ తదితర ప్రాంతాల్లోంచి అధిక సంఖ్యలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.



సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్‌కు వరస కట్టిన ఆర్‌జీఎం బాధితులు

కేసు నమోదు

సూర్యాపేట జిల్లా కేంద్రంగా గొలుసుకట్టు దందా నిర్వహిస్తున్న ఆర్‌జీపీ మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థపై గురువారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కుడకుడకు చెందిన వెంకన్నతోపాటు మరో ఐదుగురు బాధితులు ఆర్‌జీపీ సంస్థలో డబ్బులు పెట్టి మోసపోయినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకన్నకు చెందిన రూ.1.20 లక్షలతోపాటు మిగిలిన ఐదుగురు కలిపి మొత్తం రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టామని.. రెండు వారాలుగా తమకు డబ్బులు తిరిగి రావడం లేదని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు సన్నాహాలు

మోతె, న్యూస్‌టుడే: పాలేరు వాగులో ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మైనింగ్, నీటిపారుదల, భూగర్భజల, రెవెన్యూ శాఖలఅధికారులు పాలేరు వాగును పరిశీలించారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన ఈ సన్నాహాలతో ఏటా సాగుతున్న రూ.లక్షల విలువైన ఇసుక అక్రమ దందాకు చెక్ పడనుంది. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరనుంది. వినియోగదారులకు ఆన్‌లైన్‌లో తక్కువ ధరలో ఇసుక లభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మండలంలో ఉర్లుగొండ వద్ద వాగుపైనున్న వంతెన తదితర ప్రదేశాలను ఆయా శాఖల అధికారులు పరిశీలించారు. ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనువుగా ప్రాంతాలు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆయా ప్రదేశాల్లో సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేశారు. ప్రస్తుతం వాగులో వరద నీరు ప్రవహిస్తున్నందున ఇసుక తవ్వకాలు చేసే అవకాశం లేదని మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వసుమతి తెలిపారు. వాగులో వరద ప్రవాహం తగ్గిన తర్వాత రీచ్‌ల కోసం ప్రదేశాలను గుర్తిస్తామన్నారు. వరద ప్రవహిసున్నా నిత్యం పదుల కొద్దీ ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలుతోంది. నిత్యం నీళ్లలో అక్రమ తవ్వకాలు సాగితే అధికారుల లెక్కల ప్రకారం వరద తగ్గిన తర్వాత వాగులో ఇసుక దొరికే పరిస్థితి లేదు. ఇప్పటినుంచైనా నిఘా పటిష్ఠం చేసి అడ్డుకుంటేనే రీచ్‌ల ఏర్పాటు నాటికి వాగులో ఇసుక నిల్వలు ఉంటాయి.



ఉర్లుగొండలో అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

మల్బరీ సాగుతో అధిక ఆదాయం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: మల్బరీ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరీకల్చర్ ముత్యాలు అన్నారు. పట్టు రైతులకు గురువారం గడ్డిపల్లిలో నిర్వహించిన నైపుణ్య శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. పట్టు ఉత్పత్తి, మార్కెటింగ్ అంశాలపై ఎంపిక చేసిన రైతులకు కేవీకే ద్వారా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ తగు సహకారం అందిస్తోందన్నారు. ప్రిన్సిపల్ సైంటిస్టు వినోద్ యాదవ్ మాట్లాడుతూ మన దేశంలో పట్టు ఉత్పత్తి 39 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉందన్నారు. డిమాండ్ మాత్రం 65 వేల మెట్రిక్ టన్నులుందన్నారు. కేవీకే ఇన్‌ఛార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేష్, శాస్త్రవేత్తలు మాధురి, ఆదర్శ్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రోజుకింత పెచ్చులూడె.. పరిష్కారం లేదాయె

★ ప్రమాదకరంగా గుండ్లసింగారం పాలేరు ఏటి వంతెన



కూలిపోతున్న గుండ్లసింగారం వంతెన పైనుంచి వెళ్తున్న కరీంనగర్ డిపో ఆర్టీసీ బస్సు

నూతనకల్, న్యూస్‌టుడే:

సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగించే సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారి వెంట నూతనకల్ మండలం గుండ్లసింగారం శివారులో పాలేరు ఏటిపై 70 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. డంగుసున్నంతో నిర్మించిన ఈ వారధి ధరులు ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై దెబ్బతిన్నాయి. స్లాబ్‌కింద పెచ్చులు ఊడిపడి ఊచలు తేలుతున్నాయి. వంతెన దుస్థితిని గుర్తించిన 'ఈనాడు' ఆగస్టు 17న 'ప్రమాదపు అంచున వంతెన' శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన ఏఈ యుగేందర్ డీఈ శోభారాణికి సమస్యను తెలుపగా.. డీఈ 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలను జిల్లా ఎస్ఈ, చీఫ్ ఇంజినీర్ రాజేంద్రనాయక్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎస్ ఏటి ప్రవాహంలో నడుస్తూ వంతెన కిందికి వెళ్లి పరిశీలించి ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే కొత్తవంతెన నిర్మించాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రతిపాదనలతో సరి

సెప్టెంబరు 19న రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపించడంతో 'ఈనాడు'లో 'వారధికి అక్షరం ఆసరా' కథనం ప్రచురించింది. కానీ, నేటికీ నిధులు మంజూరు కాలేదు. కొత్తవంతెన మంజూరవుతుందని ఆశించిన ప్రజలు నిధులు ఎప్పుడు విడుదల చేస్తారా అని నిరీక్షిస్తున్నారు. కూలిపోతున్న వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో దాని పైనే భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నారు. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు వంతెన నానిపోయి కోతకు గురై రోజుకింత కూలిపోతోంది. ఏ క్షణాన వారధి కూలిపోతుందో తెలియని పరిస్థితి. నిధులు మంజూరు చేసి నూతన వారధి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థికశాఖ పరిశీలనలో ఉంది

– శోభారాణి, డీఈ, ఆర్‌అండ్‌బీ సూర్యాపేట

కొత్తవంతెనను రూ.15 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధంచేసి ఎమ్మెల్యే మందుల సామేల్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నెలకిందట ఆర్థిక శాఖ ఆమోదానికి పంపాం. నెల రోజుల్లో ఆమోదం లభిస్తుందని ఆశిస్తున్నాం. అప్పటి వరకు ప్రమాదాలు జరుగకుండా వంతెనపై డ్రమ్ములు పెట్టి రిబ్బన్లు కట్టాం.

జాగ్రత్తగా దాటుతున్నాం

– మల్లయ్య, ఆర్టీసీ డ్రైవర్, తొర్రూర్ డిపో



హన్మకొండ-సూర్యాపేట రూట్‌లో బస్సు నడుపుతూ రోజుకు రెండు సార్లు ఈ వంతెన దాటి వెళ్తూ వందల మంది ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేస్తుంటాం. వంతెన వద్దకు చేరగానే ఒక్కసారి బస్సు ఆపి జాగ్రత్తగా దాటాల్సి వస్తోంది. ప్రమాదకరంగా మారిన వంతెన కూలిపోతే సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు కొత్తవంతెన నిర్మించాలి.

వర్షం కురిస్తే.. భయమేస్తోంది

– గుండు వెంకన్న, ఏపీవో, మద్దిరాల మండలం



సొంత గ్రామం ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్. మద్దిరాల మండలంలో ఉపాధిహామీ పథకం ఏపీవోగా విధులు నిర్వహిస్తున్నా. కూలీలకు పని కల్పించాలంటే నిత్యం ఈ వంతెన దాటివెళ్లాలి. వంతెన కింద మట్టి రోజుకింత కూలిపోతుండటంతో భయమేస్తోంది. వర్షాలు కురిసిన రోజు ఎప్పుడు కూలుతుందో అనిపిస్తుంది. శాశ్వత పరిష్కారం చూపాలి.

చింతలపాలెంలో తగ్గని అతిసార వ్యాధి

★ ఇద్దరి మృతి, అధికారికంగా వెల్లడించని వైద్యులు

చింతలపాలెం, న్యూస్‌టుడే: చింతలపాలెంలో అతిసార వ్యాధి ఇంకా తగ్గుముఖం పట్టలేదు. వ్యాధి తీవ్రతతో ఇక్కడి నుంచి సూర్యాపేటకు తరలించిన గొంగరెడ్డి శేషిరెడ్డి(35), చింతల వీరభద్రి(60) అనే ఇద్దరు బాధితులు గురువారం రాత్రి మృతి చెందారు. ఈ ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. కొందరిని సూర్యాపేట ఆసుపత్రికి తరలించిన విషయం వాస్తవమేనని, ఇదే వ్యాధితో చనిపోయారని చెప్పలేమని, మృతి ఘటన గురించి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. వాస్తవంగా ఈ గ్రామంలో గత 20 రోజులుగా వాంతులు, విరేచనాలతో పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని హుజూర్‌నగర్, సూర్యాపేట ప్రభుత్వాసుపత్రులకు తరలిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 22న కూడా మెరుగైన వైద్య సేవల కోసం కొందరిని సూర్యాపేట తరలించినట్టు వైద్యులు పేర్కొంటున్నారు.





శేషిరెడ్డి వీరభద్రి

వారిలో ఈ ఇద్దరు మృతి చెందారు. స్వాతి, రాములమ్మ, నాగమ్మ, సత్యనారాయణ, నాగలక్ష్మీ, మమత తదితరులు ఈ వ్యాధిబారిన పడగా.. గురువారం రాత్రి కూడా కొందరిని హుజూర్‌నగర్‌కు తరలించారు. ఇక్కడి కొన్ని కాలనీలలోనే అతిసార ప్రబలుతున్న పరిస్థితి కన్పిస్తోంది. కొన్ని బోరు బావులు, మంచినీటి ట్యాంకుల నుంచి సరఫరా అవుతున్న నీటిని వీరు తాగుతున్నట్టు వైద్యులు గుర్తించారు. ఆ నీటిని పరీక్షలకు పంపారు. అవి కలుషితమవుతున్నట్టు తమకు నివేదిక అందిన వెంటనే తాగొద్దని సూచించామని వైద్యులు చెబుతున్నారు. ఇంటింటి సర్వే చేపట్టి వైద్య చికిత్సలు అందిస్తున్నట్టు చెబుతున్నప్పటికీ.. వ్యాధి ఇంకా తగ్గుముఖం పట్టకపోవడం గమనార్హం.

సూర్యాపేట పట్టణంలో ఓ శుభకార్య వేదికలో హంగు, ఆర్భాటాలతో వివాహం జరిగింది. ఆహార పదార్థాలకు రూ.12 లక్షలు ఖర్చు చేసి, 16 రకాల వంటకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమం ముగిసే సమయానికి చూస్తే అతిథులకు వడ్డించిన విస్తర్లలోనే సుమారు రూ.2.5 లక్షల విలువైన పదార్థాలు వృథా అయినట్లు గుర్తించారు.

నల్గొండలో ఓ జంటకు తల్లిదండ్రులు వివాహం జరిపించారు. కట్నకానుకలు ఇతర సామాగ్రికి రూ.2 లక్షలు పోను ఆహార పదార్థాలకు రూ.80 వేలు మాత్రమే వెచ్చించారు. రెండు రకాల కూరలు, అన్నం, సాంబారు, తీపి పదార్థాలను వడ్డించారు. వివాహానికి హాజరైనవారు తృప్తిగా భోంచేసి, అంతా బాగుందని కితాబిచ్చారు.

తినాలనే ఆశ.. వృథాపైనే ధ్యాస

నాంపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఏటా భారీ సంఖ్యలో వివాహాలు జరుగుతున్నాయి. భారీస్థాయిలో హంగు ఆర్భాటాలకు వెళ్తూ.. లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పొదుపు మంత్రం పాటిస్తేనే పెళ్లి చేసే తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకుండా జాగ్రత్త పడవచ్చు. ముందే మేల్కొని వివాహ ఖర్చులపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే ప్రయోజనం చేకూరే అవకాశాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు.



★ 2011 లెక్కల ప్రకారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో 34.57 లక్షల జనాభా నివసిస్తోంది. ఏటా సుమారు 8 వేల నుంచి 10వేల వరకు పెళ్లిళ్లు జరుగుతున్నాయి. చిన్నస్థాయిలో చేసుకునే వివాహాలకు సాధారణంగా ఆహారానికి రూ.లక్ష వరకు, స్థాయిగల కుటుంబాల్లో రూ.1.5లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. సంపన్న వర్గాల కుటుంబాల్లో రూ.10 నుంచి రూ.25 లక్షల వరకు ఆహారానికి ఖర్చు చేస్తున్నారు. ఇంతలా అతిథి ఆతిథ్యం కోసం చేస్తున్న ఖర్చును అతిథులే గుర్తించకుండా చెత్తబుట్టలో వేస్తుండటంతో ఆర్థిక, పర్యావరణ సమస్య ఉత్పన్నమవుతోంది. చిత్తశుద్ధితో వ్యవహరిస్తే వృథా నియంత్రణకు అవకాశాలున్నాయి.

అన్నం పరబ్రహ్మ స్వరూపం..

'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అంటారు. రోజూ ఎంతో మంది పేదలు ఆహారం దొరక్క అల్లాడుతున్నారు. గుప్పెడు మెతుకుల కోసమే కోట్లాది మంది పొట్టచేత పట్టుకొని వలస బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం జరిగే వేడుకల్లో భారీగా ఆహారం వృథా అవుతున్నట్లు అంచనా. నిర్వాహకులు పరిమితికి మించి ఆహార పదార్థాలు తయారు చేయకుండా ఉంటే చాలు. ఆకలికి తగ్గట్టుగా వడ్డించుకుంటే చాలు. భోజనం మధ్యలో మీరు చెత్త డబ్బా వద్దకు వెళ్తున్నారంటే కచ్చితంగా ఆహారం వృథా చేస్తున్నట్లే లెక్క. ఏదైనా శుభకార్యాలు, ఇతర వేడుకల్లో ఆహారం మిగిలితే పారేయకుండా స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకొని అనాథలకు అందజేస్తే ప్రయోజనం ఉంటుంది.

ఆలోచించండి

మీరు ఓ వివాహానికి వెళ్లారు. అక్కడ ప్లేట్ నిండా ఆహార పదార్థాలు వడ్డిస్తారు. మీరు వద్దన్నా.. ఆప్యాయంగా తినండని మర్యాద చేస్తారు. తీరా మీకు సరిపడినవి తిని మిగతావి పారేస్తారు. ఒక్క క్షణం ఆలోచించండి.. మీరు ఎంత వృథా చేశారో తెలుస్తుంది. అక్కడ అధిక సంఖ్యలో ఆహార పదార్థాలు ఏర్పాటు చేయడంతో ఏది తినాలో తెలియక అన్ని రుచి చూడాలని నిండా పెట్టుకుంటారు. మొత్తం తినలేక వృథా చేస్తారు.

గతంలో..

గతంలో అయితే శుభకార్యాల్లో అతిథులను కింద కూర్చోబెట్టి లేదా కుర్చీలు, టేబుళ్లు వేసి భోజనాలను వడ్డించేవారు. ఈ విధానంతో ఆహార పదార్థాలు తినకుండా వదిలేసేవారిని గుర్తించే అవకాశం ఉండటంతో వృథా తక్కువగా ఉండేది. ప్రస్తుతం వేడుక ఏదైనా పల్లె పట్టణమనే తేడా లేకుండా నిలబడి తినే (బఫే)విధానాన్నే అవలంబిస్తున్నారు. దీంతో ఆహార పదార్థాలు అలా రుచి చూసి ఇలా వదిలేస్తుండటంతో వడ్డించుకున్న పదార్థాల్లో 25శాతం వరకు చెత్త డబ్బాల్లోకే చేరుతోంది.

స్వయం శోధన... నిత్య సాధన

చిట్యాల, న్యూస్‌టుడే: భిన్న వ్యాపకాలను ఎంచుకుని వాటిపైనే స్వయంగా శోధిస్తూ, నిత్యసాధన చేస్తున్నారు చిట్యాలకు చెందిన పంతంగి నవీన్, హరిత కుమార్తెలు మేఘన, సాయిలేఖన. మేఘన ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో హోమియో వైద్యురాలిగా పనిచేస్తూ.. చిత్రలేఖనంలో, సాయిలేఖన హైదరాబాద్ గీతం విశ్వవిద్యాలయంలో బీఎస్ సైకాలజీ మొదటి సంవత్సరం చదువుతూ.. సంగీత పరికరాల వాయిద్యాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. ఎలాంటి ప్రత్యేక శిక్షణ లేకుండానే ఎవరికి వారు ఆన్‌లైన్‌లో స్వయంగా శోధిస్తూ.. దానిపై పట్టు సాధించడానికి నిత్యం కనీసం రెండు గంటలు సాధన కోసం కేటాయించుకుంటున్నారు. తాము ఎదుర్కొన్న ఒత్తిడిని తమ వ్యాపకాలతో అధిగమిస్తున్నామంటున్నారు.

నేర్పించిన చిట్కాలతో..

డాక్టర్ పంతంగి మేఘన



చిన్నప్పుడు (మూడో తరగతిలో)మా పాఠశాలలో బొమ్మలు గీయడంలో ప్రాథమిక మెలకువలు నేర్పించారు. ఇంటి దగ్గర చిత్రకారుడైన మా చిన్నతాతయ్య మధుసూదన్ రావు చిత్రలేఖనంలో చిట్కాలు చెప్పేవారు. ఒత్తిడిని అధిగమించడానికి చాలామంది యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి చేస్తుంటారు. నేను చిత్రలేఖనంతో ఒత్తిడిని అధిగమిస్తాను. ఏదైనా ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు పెయింటింగ్ వేయడం అలవాటయింది. పెన్సిళ్ల నుంచి బ్రష్షులు, రంగులు, కాగితాల వరకు ఆన్‌లైన్‌లో చూసి కొనుగోలు చేస్తుంటాను. పెద్దచిత్రాలు రెండు రోజులు, చిన్న చిత్రాలయితే ఒక రోజులో పూర్తి చేస్తాను. హోమియో చదువుతున్నప్పుడు అంతర్ కళాశాలల మధ్య చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అందులో బహుమతి గెలుచుకోవడం మరపురాని అనుభూతి.

నిత్యం రెండు గంటలపాటు..

పంతంగి సాయిలేఖన



నేను ఇష్టంగా వరసగా ఒక్కొక్కటిగా కొనుగోలుచేసిన సంగీత పరికరాలతో సాధన చేయడానికి నిత్యం రెండు గంటల సమయం కేటాయించుకుంటాను. ప్రస్తుతం గిటార్, ఖలింబ(పియానోకు చిన్నవెర్షన్), వయోలిన్, క్లావ్‌బాక్స్, యుకులేలి, ఫ్లూట్ నాదగ్గర ఉన్నాయి. అన్నీ యూట్యూబ్‌లో చూసి వాయించడాన్ని నేర్చుకున్నాను. నాలుగో తరగతి నుంచే పియానో వాయించడం ప్రారంభించాను. స్నేహితులు, టీచర్లు అభినందించి ప్రోత్సహించారు. ఏటా కొత్త పరికరం కొని సాధన చేయాలని సంకల్పంగా పెట్టుకున్నాను. అడిగిన పరికరాలను అమ్మానాన్న తెచ్చి ప్రోత్సహించారు. వారం క్రితం మా విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలోనూ నా వాయిద్య ప్రదర్శన ఇచ్చాను. సంగీతంలో ఏఆర్ రహమాన్, శంకర్ మహదేవన్‌లు స్ఫూర్తి.



మేజిక్ ఫెస్ట్‌లో జ్ఞాపిక, నగదు అందుకుంటున్న నితిన్

జాతీయ స్థాయిలో నితిన్ ప్రతిభ

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరుకు చెందిన కట్కం నితిన్ జాతీయ స్థాయిలో జరిగిన మెజీషియన్ ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి హాజరైన వారిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 20న కేరళలోని కోచ్చిలో 'మలయాళీ మెజీషియన్స్ అసోసియేషన్' పరంగా జాతీయ స్థాయిలో మేజిక్ ఫెస్ట్ నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ఇంద్రజాలికులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. తెలంగాణ నుంచి పాల్గొన్న 18 మందిలో నితిన్ ప్రథమం స్థానంలో నిలిచారు. సంస్థ తరపున ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు అందజేశారు. నితిన్‌ను స్థానిక పద్మశాలీ యువజన సంఘాల నాయకులు గురువారం ఆలేరులో సన్మానించారు. బేతి రాములు, బింగి నర్సింహులు, పాశికంటి శ్రీనివాస్, ఆడెపు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి దారి.. అందంగా మారి

ఊరికి దూరంగా.. కంపచెట్లతో.. మురుగు నీటికి నిలయంగా.. పందులకు ఆవాసంగా.. వానొస్తే రోజుల తరబడి నీళ్లలో నివాసం.. దోమలు, దుర్వాసనల మధ్య కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఒకప్పటి 60 ఫీట్ల దారిలోని ప్రజలది. ఆ దారి వెంట పదుల సంఖ్య జూనియర్ కళాశాలల నిర్వహణ మాత్రమే ఉండేది. పీఎస్ఆర్ సెంటర్ చివరి నుంచి అటు జాతీయ రహదారి వరకు అర కిలోమీటరు ఉండగా.. దాదాపు గుంతలే ఎక్కువగా దర్శనమిచ్చే దుస్థితి. కానీ నేడు ఆ దారి పరిస్థితి భిన్నంగా మారింది. దారి మొత్తం పూర్తిగా సీసీ రోడ్డు వెడల్పు పెంచేశారు. పలు విభిన్న వ్యాపారాలకు నిలయంగా మారింది. చిన్న హోటళ్ల నుంచి రెస్టారెంట్ల వరకు, పాఠశాలల నుంచి జూనియర్ కళాశాలల వరకు, టీస్టాళ్లు, సెలూన్ దుకాణాలు, సమోసా విక్రయ కేంద్రాలు, బేకరీలు ఇలా పదుల సంఖ్యలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ దారి ప్రస్తుతం నిత్యం రద్దీగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులతో సందడి నెలకొంటుంది. ఇప్పుడు ఇక్కడ దొరకని వస్తువంటూ లేదని స్థానికులు చెబుతున్నారు.



రద్దీగా.. సందడిగా.. సూర్యాపేట 60 ఫీట్ల రహదారి

పూర్తిగా మారిపోయింది..

– రామ్మూర్తి, టిఫిన్ బండి నిర్వాహకుడు, సూర్యాపేట

ముప్పై ఏళ్లుగా టిఫిన్ బండి నడుపుతున్నా.. గతంలో రద్దీ ప్రదేశమైన ఏపూరు బస్టాండ్ వద్ద నిర్వహించా. 60 ఫీట్ల దారిలో ప్లాటు ఉండగా ఇల్లు కట్టుకున్నా. మొదట్లో ఇక్కడే బండి పెడదామనుకున్నా. కానీ ఈ ప్రాంత పరిస్థితిని చూసి వ్యాపారం సాగుతుందో లేదోనని భయపడి పూర్వ స్థానంలోనే నిర్వహించా. ప్రస్తుతం రహదారి రూపురేఖలు పూర్తిగా మారిపోవడంతో ఇక్కడే ఏర్పాటు చేసుకున్నా. ఇప్పుడు అక్కడి కంటే ఇక్కడే వ్యాపారం బాగుంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువకులు, వృద్ధులతో ఆ దారంతా సందడి మారింది.

– సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే:

ఊడిన బస్సు టైరు.. పాదచారునికి గాయాలు

చౌటుప్పల్‌(గ్రామీణం, న్యూస్‌టుడే: ట్రావెల్ బస్సు పరుగెడుతుండగా.. టైరు ఊడిపోయిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం సమీపంలో చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణికులతో ట్రావెల్ బస్సు గురువారం ఉదయం బయలుదేరింది. లింగోజిగూడెంలోని భారత్ పెట్రోలియం బంకు వద్దకు చేరుకోగానే ట్రావెల్ బస్సు వెనుక టైరు ఊడిపోయింది. ఊడిన టైరు జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న పాదచారుడికి తగలడంతో అతని కాలు విరిగింది. క్షతగాత్రుడు ఒడిశాకు చెందిన శశికాంత్ బిస్తాగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. టైరు ఊడిపోయిన వెంటనే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిదానంగా నిలపడంతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ పర్యవేక్షణలో ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఊడిపోయిన ట్రావెల్ బస్సు టైరు

హోరాహోరీగా కొనసాగిన క్రీడాపోటీలు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి శ్రీనివాసనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలో గురుకులాల సొసైటీ ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి క్రీడాపోటీలు రెండో రోజు(గురువారం) కొనసాగాయి. దామరచర్ల పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఉమాదేవి ప్రారంభించగా.. విద్యార్థినుల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. విద్యార్థులు ఒకరిని మించి ఒకరు పోటీ పడుతూ ప్రతిభ చాటారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, రన్నింగ్ క్రీడా పోటీలు నిర్వహించారు.

అండర్-17 విభాగంలో.. కబడ్డీ: మొదటి స్థానం: దామరచర్ల గురుకులం విద్యార్థులు. తుమ్మడం గురుకులం విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు.



కబడ్డీ క్రీడలో తలపడుతున్న విద్యార్థినులు

ఖో-ఖో: 24 పాయింట్లు సాధించి నల్గొండ గురుకులం విద్యార్థులు మొదటి స్థానం. ఒకే ఒక పాయింట్ సాధించి వలిగొండ గురుకులం విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు.

రన్నింగ్: 100 మీటర్ల పరుగు పందెంలో దేవరకొండ గురుకుల విద్యార్థిని ఎస్.ఉమ మొదటి స్థానం. 400 మీటర్ల పరుగు పందెంలో నల్గొండ గురుకులం విద్యార్థినీ ఎం.ఇందు మొదటి స్థానం. 1500 మీటర్ల పరుగు పందెంలో భువనగిరి గురుకులం విద్యార్థిని వి.నవ్య మొదటి స్థానం. 4*100 మీటర్ల పరుగు పందెంలో నల్గొండ గురుకులం విద్యార్థిని ఎం.ఇందు. మొదటి స్థానంలో గెలుపొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ సరిత, పీడీ ఇందిరా, పీఈటీ శాంతి, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బంగారానికి మెరుగుపెడతామని మోసం

త్రిపురారం, న్యూస్‌టుడే: బంగారానికి మెరుగుపెడతాం, పూసలు అల్లుతామంటూ ఇద్దరు వ్యక్తులు ఓ గ్రామంలో తిరుగుతూ.. మోసానికి పాల్పడిన ఘటన వెలుగు చూసింది. బాధితుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం కామారెడ్డిగూడెం పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో గురువారం హైదరాబాద్‌లోని కార్మికనగర్‌కు చెందిన 60 ఏళ్ల వయస్సు పైబడిన పత్తిపాటి నాగరాజు, బొబ్బ వెంకట్‌రెడ్డి తిరిగారు. ఆ క్రమంలో గ్రామానికి చెందిన కొంగరి సునీత వారితో పూసలు అల్లించుకున్నారు. బంగారానికి మెరుగుపెడతాం అనేసరికి తనకున్న రెండు తులాల పుస్తెల తాడును వారికి ఇచ్చారు. పుస్తెల తాడును ద్రావణంలో కరగబెట్టడంతో రాగి కలర్‌లోకి వచ్చింది. బరువు సైతం తగ్గింది. ఇది గమనించే లోగా.. అప్పటికే నిందితులు గ్రామం నుంచి పరారయ్యారు. బాధితురాలు గ్రామస్థులకు తెలియజేయడంతో గ్రామంలోని యువకులు మండల పరిధిలోని పరిసర గ్రామాల్లో ఆచూకీ కోసం బైక్‌లపై వెళ్లారు. చివరికి కంపసాగర్ పరిధిలోని కేవీకే సమీపంలో పట్టుకొని నిలదీయగా నిజం ఒప్పుకొన్నారు. తిరిగి గ్రామానికి వారిని తీసుకెళ్లి బంగారాన్ని కరగబెట్టగా 20 గ్రాములకుగాను 17 నుంచి 18 గ్రాములే వచ్చింది. జరిగిన ఘటన ప్రచార మాధ్యమాల్లో వైరలైంది. గ్రామస్థులు వారిద్దరిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బీసీ జేఏసీ ఛైర్మన్‌గా ధనుంజయ

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీ జేఏసీ ఛైర్మన్‌గా పెండెం ధనుంజయనేత నియమితులయ్యారు. ఈ మేరకు ఈ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య గురువారం హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. యువకులు బీసీ ఉద్యమంలో పాల్గొని బహుజన రాజ్యాధికారం సాధించాలని సూచించారు. జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, జెల్ల నరేందర్, వెంకటేశం, నందగోపాల్, ఉదయ్, రమేష్, యాదయ్య, సయ్యద్, వెంకన్న పాల్గొన్నారు.



ధనుంజయనేతకు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

పీల్చేగాలి.. తాగేనీరు.. ఖరాబు

దేశంలో వాయు కాలుష్యంతో ఏటా 33 వేల మంది మృత్యువాత పడుతున్నట్లు జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ సంస్థ నివేదికలు ఇటీవల స్పష్టం చేస్తున్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ సంస్థల నివేదికలను సుమోటోగా తీసుకున్న ఎన్‌జీటీ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి ఈ నెల 21న నోటీసులు జారీ చేయటంతో పాటు వెంటనే కాలుష్యంపై విచారణ ప్రారంభించింది.

ఉమ్మడి జిల్లాలో 319 అనుమతి పొందిన భారీ, 84 మధ్యతరహా, 8,069 సాధారణ చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి.71,687 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోజువారీ కూలీలు లక్ష మంది వరకు ఉన్నట్లు అంచనా.

2019లో ప్రభుత్వం జీవో 33తో 'జిల్లా స్థాయిలో గాలి నాణ్యత పర్యవేక్షణ కమిటీ'లను ఏర్పాటు చేసినా.. అవి కాగితాలకే పరిమితం కాగా.. ఆచరణలో కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

తెలంగాణ ప్రాంతంలో అత్యధికంగా కాలుష్యం వెలువరించే జిల్లాల్లో హైదరాబాద్ మహానగరం తర్వాత ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధానంగా ఉంది. ఇక్కడ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోంది. సాధారణంగా కాలుష్య రేణువుల స్థాయి 2.5 మైక్రాన్లు ఉండాల్సి ఉండగా అంతకంటే 1.6 శాతం నల్గొండ జిల్లాలో ఎక్కువగా ఉన్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గతంలో నివేదించింది. ఈ పరిస్థితిని చూస్తే పెరుగుతున్న పరిశ్రమలతో కాలుష్యం తీవ్రత సైతం అదే రీతిలో పెరుగుతోందని అర్థమవుతోంది.



మిర్యాలగూడలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థపు నీరు గుంతల్లో నిలిచిన తీరు

14 ఏళ్ల క్రితమే పీసీబీ ఆందోళన..

ఆసియా ఖండంలోనే అత్యధికంగా బియ్యం పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. 14 ఏళ్ల క్రితం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నీటి, వాయు కాలుష్యం తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ పరిశ్రమల నిర్వాహకులకు మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహించారు. పరిశ్రమల్లో వ్యర్థపు నీటిశుద్ధి ట్యాంకులు నిర్మించి నీటిని శుద్ధిచేసిన తరువాత బయటకు వదలాలని, మిల్లుల పొగగొట్టాలు 60 అడుగులకు మించి ఎత్తులో నిర్మించాలని ఆదేశించారు. బూడిద, పొట్టు గాలిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిమెంటు పరిశ్రమల కాలుష్యంతో గాలి, పరిసరాలు కాలుష్యం పెరిగిపోతుండగా సమస్య తీవ్రరూపం దాల్చుతుంది.



రైస్‌మిల్లుల నుంచి వచ్చే బూడిద గాంధీనగర్‌లోని ఇళ్లపై పడిన తీరు (పాత చిత్రం)

ముక్కుమూసుకుని వెళ్లాల్సిందే..

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి దుర్వాసనలు వచ్చాయంటే చాలు చౌటుప్పల్ వచ్చినట్లుగా సంకేతం వస్తుంది. భరించలేని వాసనలు వెదజల్లే పరిశ్రమలు యాదాద్రి జిల్లాలో విస్తరించి ఉండగా వీటి కాలుష్యం వ్యర్థాలు ఒక్కోసారి రహస్యంగా తెచ్చి రహదారుల వెంట పోస్తున్నారు. జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు ముక్కుమూసుకోకుండా వెళ్లలేని పరిస్థితి కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో..

- చర్మ వ్యాధులతో బాధపడేవారు సుమారు 15,200 మంది
- ఊపిరితిత్తుల సమస్యలపై ఇబ్బంది పడేవారు సుమారు 18,020 మంది

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: కౌలుకు పొలం చేసుకుని గౌరవంగా బతుకుతున్న ఓ పేదకుటుంబానికి చెందిన యజమానిని విద్యుదాఘాత రూపంలో మృత్యువు కబళించింది. భార్య కళ్ల ముందే విద్యుదాఘాతంతో భర్త విగత జీవిగా మారటంతో ఆమె రోదనలు మిన్నంటాయి. ఈ హృదయ విదారక ఘటన మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్సై లోకేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లగంతుల యల్లయ్య(40) భార్య రేణుక మరో కూలి వెంకన్నతో కలిసి గురువారం పొలానికి నీలి మందు పిచికారీ చేయడానికి వెళ్లారు. అందులో భాగంగా నీటి కోసం యల్లయ్య బోరు మోటారు ఆన్ చేసే క్రమంలో కరెంటు షాక్‌కు గురయ్యారు. అది చూసిన వెంకన్న యల్లయ్యను పట్టుకోగానే ఆయనకు షాక్ కొట్టి దూరంగా పడ్డారు. భార్య రేణుక పెద్దగా కేకలు వేయటంతో పక్కనే ఉన్న కొందరు రైతులు విద్యుత్తు నియంత్రిక వద్ద సరఫరాను నిలిపేశారు. యల్లయ్యను వెంటనే పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య రేణుక, తల్లి సీతమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉండగా... పెద్ద కుమార్తెకు వివాహమైందని చెప్పారు.



యల్లయ్య

పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం

నాంపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగు మందు తాగి మృతి చెందిన ఘటనపై గురువారం నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం.శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లమల్లేపల్లికి చెందిన మల్లిరెడ్డి సైదిరెడ్డి(36) దంపతులకు కుమార్తె(3) సంతానం. గత కొంతకాలంగా సైదిరెడ్డి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా, భార్య కూడా రెండేళ్లుగా మూర్ఛ వ్యాధితో ఇబ్బంది పడుతూ పుట్టింట్లోనే ఉంటోంది. భార్యభర్త ఇరువురు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుండటంతో ఇటీవలే వీరి కుమార్తెను హైదరాబాద్‌లోని కీర్తనా ఫౌండేషన్ సంరక్షణలో ఉంచారు. కాగా తీవ్రమైన జబ్బుతో బాధపడుతున్న అతడు మంగళవారం వ్యవసాయ పొలం వద్ద పురుగు మందు తాగి బలవన్మరణం చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫారంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

సాగర్ నుంచి నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరదనీరు వస్తుండడంతో ఎన్నెస్పీ అధికారులు మరోసారి గురువారం మధ్యాహ్నం నుంచి డ్యాం గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. రాత్రి 9 గంటల వరకు అందిన సమాచారం మేరకు శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 2,42,561 క్యూసెక్కులు వరద నీరు వస్తుండడంతో అధికారులు డ్యాం 24 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,92,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతో పాటుగా కుడి, ఎడమకాల్వ, ప్రధాన విద్యుత్ కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరద కాల్వ ద్వారా మొత్తం 2,42,561 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయనీటిమట్టం 590.00 అడుగులు కాగా.. 312.0450 టీఎంసీల వద్ద ఉంది.

తండ్రికి శాంతి చేస్తూ తనయుడి దుర్మరణం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: కొద్దిరోజుల క్రితం మరణించిన తండ్రికి శాంతి చేస్తుండగా.. తనయుడు కోనేరులో పడి మృతిచెందిన విషాద సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం పాతసూర్యాపేటలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతసూర్యాపేటకు చెందిన పోలోజు రుక్నాచారి 25 రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. అతనికి భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రుక్నాచారికి శాంతి చేసే కార్యక్రమంలో భాగంగా కుటుంబ సభ్యులు గురువారం గ్రామ సమీపంలోని చక్రయ్యగుట్టపైకి వెళ్లారు. అక్కడ కుమారుడు పోలోజు మహేష్‌చారి(22) శాంతి ప్రక్రియ పూర్తి చేసి గుట్టమీద ఉన్న కోనేరులో స్నానమాచరించేందుకు వెళ్లారు. కాలుజారి కోనేరులో పడిపోయి.. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టూ ఉన్నా రక్షించలేకపోయారు. కోనేరులోనే ఈత కొడుతున్న కొందరు బంధువులు అతన్ని కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పరిసర ప్రాంత రైతులు వచ్చి మహేష్ మృతదేహాన్ని వెలికితీశారు.

★ బతుకుదెరువు కోసం పదిహేనేళ్ల క్రితం ఇదే జిల్లాలోని నూతనకల్ మండలం ఎర్రపహాడ్‌కు వెళ్లిన వీరి కుటుంబం తండ్రి అనారోగ్యం పాలవడంతో ఇటీవల పాతసూర్యాపేటకు వచ్చారు. నెల రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ఆర్.శంకర్‌నాయక్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో.. ఆత్మహత్య

చౌటుప్పల్(గ్రామీణం, న్యూస్‌టుడే: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో ఉరేసుకొని ఒకరు మృతి చెందినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు. సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన సుక్క రాజు(36) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్యతో కలిసి అత్తగారి ఊరు దండుమల్కాపురంలోనే నివాసం ఉంటున్నాడు. గత కొంత కాలం నుంచి భార్యతో రాజుకు తగాదాలు నడుస్తున్నాయి. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఎక్కువ అవ్వడంతో ఇంట్లోనే ఉరేసుకొని చనిపోయాడు. గురువారం మధ్యాహ్నం స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.



సుక్క రాజు

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా సామిల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి కోటగిరి వెంకటనారాయణ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం సామిల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు, యూనియన్ అధ్యక్షులు శేషయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? మునగాల మండలం కొక్కిరేణి ఎస్సీ కాలనీలో గత మూడు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు?
– ఫ్రాన్సిస్‌బాబు, కొక్కిరేణి

✔ పరిశీలించి వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.
– వీరారెడ్డి, ఇన్‌ఛార్జి కార్యదర్శి


మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

? 16వ వార్డుకు చెత్త బండి రావటం లేదు. చెత్త పేరుకుపోయి దోమలు పెరుగుతున్నాయి. సమస్యను పరిష్కరించగలరు.
– గౌతమ్, హుజూర్‌నగర్

✔ రోజు విడిచి రోజు అన్ని ప్రాంతాలకు చెత్త బండిని పంపిస్తున్నాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
– యాకుబ్‌పాషా, కమిషనర్, పురపాలక సంఘం, హుజూర్‌నగర్

పరిశీలన: వసతుల లేమి.. విద్యార్థుల ఇబ్బంది



హుజూర్‌నగర్: ఎస్సీ బాలుర వసతి గృహంలో అద్దాలు, దోమల మెస్‌లు లేని కిటికీ

అసలే విద్యార్థులు లేక వెలవెలబోతున్న వసతి గృహాల్లో వసతుల లేమి కూడా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. హుజూర్‌నగర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో గతంలో 120 మందికి పైగా విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం గురుకులాలు రావడం, ఇతరత్రా కారణాలతో విద్యార్థుల సంఖ్య సగానికి పడిపోయింది. ప్రస్తుతం వసతి గృహంలో 50 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఇప్పటికే దుప్పట్లు పంపిణీ చేశారు. కానీ విద్యార్థులు పడుకుంటున్న హాలు కిటికీల అద్దాలు పగిలి ఉండటం వల్ల దోమలు ఎక్కువగా వస్తున్నాయి. కొన్ని కిటికీలకు దోమ తెర ఉన్నా చిరిగిపోయి ఉంది. రాత్రి సమయంలో విద్యార్థులు దోమలతో పోరాడుతూనే పడుకోవాల్సి వస్తుంది. ఇక వసతి గృహంలో కోతుల బెడద కూడా అధికంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. ఇవి గదుల్లోకి వచ్చి భయపెడుతున్నాయని 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

★ వసతి గృహం కిటికీలను బాగు చేసేందుకు నిధులు మంజూరై, గుత్తేదారుకు పనులు అప్పగించినట్లు వార్డెన్ రమేశ్ తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని గుత్తేదారు తెలిపినట్లు వివరించారు.

– హుజూర్‌నగర్, న్యూస్‌టుడే



వసతి గృహం ఆవరణలో సంచరిస్తున్న కోతులు

పిచ్చిచెట్లకు నిలయం.. క్రీడా ప్రాంగణం



నేరేడుచర్ల, హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: నేరేడుచర్ల పురపాలికలో రూ.లక్షలు వెచ్చించి రెండు క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో 14వ వార్డులో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణంలో నిర్వహణ లేకపోవడంతో కంప చెట్లు పెరిగాయి. ఆవరణంతా గడ్డి, పిచ్చిచెట్లతో నిండి ఉండటంతో పాటు ఆవరణలో నీటి నిల్వలతోనూ క్రీడాప్రాంగణం నిరుపయోగంగా మారింది. పురపాలిక అధికారులు దృష్టి పెట్టి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. పిచ్చి చెట్లు తొలగించి వినియోగంలోకి తెస్తామని పుర కమిషనర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

పనులు ముమ్మరం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న మహా రుద్రాభిషేకం పనులు చురుకుగా సాగుతున్నాయి. వేల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై గురువారం సీఐ చరమందరాజు మహా రుద్రాభిషేకం నిర్వహించే ఎన్నెస్పీ క్యాంపు ఉన్నత పాఠశాలను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హాజరవుతున్నందున వారి వెంట వచ్చే నాయకులకు చేయాల్సిన ఏర్పాట్ల గురించి సీఐ చర్చించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ద్వారాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలను లోపలకు రాకుండా మిర్యాలగూడ రహదారి అవతలివైపునే ఉండేలా చర్యలు తీసుకొంటున్నారు.



ఏర్పాట్లపై నిర్వాహకులతో చర్చిస్తున్న సీఐ చరమందరాజు

భారీగా పూజా సామగ్రి

ఆది దేవునికి నిర్వహించే మహా రుద్రాభిషేకం 45 మంది నాగ సాధువులు నిర్వహించనున్నారు. నాగసాధువులు మట్టితో (మృత్తిక) చేసిన శివలింగానికి మహా రుద్రాభిషేకం జరుగుతుంది. ప్రతి ఇంటి నుంచి ఒక బిందె నీళ్ల తీసుకరావడానికి నిర్వాహకులు భక్తులను ఆహ్వానిస్తున్నారు. రుద్రాభిషేకం నిర్వహణకు పసుపు, కుంకుమ, గంధం ఒక్కొక్కటి 200 కిలోల చొప్పున సేకరిస్తున్నారు. విభూది 300 కిలోలు, సింధూరం 150 కిలోలు, ఆవుపాలు 150 లీటర్లు, ఆవు పెరుగు 50 కిలోలు, ఆవు నెయ్యి 10 కిలోలు, పుట్ట తేనే 10 కిలోలు, పండ్ల రసాలు 250 కిలోలు, నవగ్రహ పిండ్లు 25 కిలోలు, అన్ని రకాల పూలు 600 కిలోలు, లక్ష రుద్రాక్షలు, అన్ని రకాల ఆకులు 30 గంపలు సేకరిస్తున్నారు. ★ నాగ సాధువుల ఆధ్వర్యంలో ఈనెల 27న సాయంత్రం 6.10 గంటల నుంచి 7 గంటల వరకు ఈ మహా క్రతువు జరుగనుంది.

పంచ్ కొట్టి.. పతకం పట్టి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విద్యతో పాటు కరాటే పోటీల్లో రాణిస్తున్నారు కిట్స్ కళాశాల విద్యార్థినులు. రక్షణతోపాటు ఆత్మ విశ్వాసానికి కరాటే ఎంతో దోహదపడుతుంది. ఇటీవల మిర్యాలగూడలో జరిగిన 22వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తొలిసారి పాల్గొని బంగారు పతకాలు సాధించారు.

మొదటిసారే బంగారు పతకం: సంధ్య



మా అమ్మానాన్నలు వెంకన్న, సైదమ్మలు వ్యవసాయం చేస్తున్నారు. స్వగ్రామం శాలిగౌరారం మండలం మాధారం. డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఏడాదిగా కరాటేలో మెలకువలు నేర్పించారు. తొలిసారిగా జాతీయ స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాను.

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది: అఖిల



మాది తుంగతుర్తి మండలం సంగెం గ్రామం. నాన్న సురేంద్రచారి వడ్రంగి పని చేస్తున్నారు. అమ్మ సరళ గృహిణి. నాకు కరాటే అంటే ఇష్టం. కళాశాలలో నేర్పిస్తుండటంతో నాకూ కరాటే నేర్చుకోవాలనే తపన ఉండేది. ఏడాది పాటు శిక్షణ పొందాను. కరాటేతో ఆత్మ రక్షణ, ఆత్మ విశ్వాసం పెరుగుతుంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో... సింధు



మాది నల్గొండ జిల్లా మునుగోడు మండలం. నాన్న చంద్రశేఖర్ ఆర్టీసీ డ్రైవర్. అమ్మ ధనమ్మ గృహిణి. నాకు కరాటే అంటే ఇష్టం. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శిక్షణను సద్వినియోగం చేసుకున్నా. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తొలిసారిగా జాతీయస్థాయికి ఎంపికై బంగారు పతకం, ప్రశంస పత్రాన్ని అందుకోవడం ఆనందంగా ఉంది. కరాటే ఆత్మ రక్షణకు ఎంతో దోహదం చేస్తుంది. చదువుతోపాటు క్రీడల్లో రాణించడం ఎంతో సంతోషంగా ఉంది.

క్రీడాభివృద్ధికి కృషి చేయాలి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో క్రీడలను ప్రోత్సహించి, క్రీడాభివృద్ధికి కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నట్లు జాతీయ కబడ్డీ క్రీడాకారుడు దేవరం రవీందర్‌రెడ్డి తెలిపారు. గవర్నర్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కలెక్టర్, ఎస్పీల సమక్షంలో జిల్లా క్రీడాకారుల గురించి రవీందర్‌రెడ్డి గురువారం వివరించారు. జిల్లాలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని గవర్నర్ సూచించారు. మంత్రి ఉత్తమ్ ఈ విషయంపై మాట్లాడుతూ క్రీడాకారులకు న్యాయం చేస్తామని, క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని అన్నట్లు ఆయన తెలిపారు.

రైతులందరూ కలిసి.. దారి బాగు చేసి



మునగాల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో సాగర్ ఎడమ కాల్వ కట్ట పైనుంచి రైతులు పొలాలకు వెళ్లే మార్గం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంతలమయంగా మారింది. నిత్యం రైతులు పొలాల వద్దకు రాకపోకలు ఈ మార్గం నుంచే కొనసాగిస్తుంటారు. ప్రస్తుతం కోతల సమయం సమీపిస్తుడటంతో రైతులు కలిసి కట్ట పైనున్న దారిలోని గుంతల్లో రాళ్లు, మట్టిని తోలించి పూడ్చారు. ఎన్నెస్పీ అధికారులు పట్టించుకోకపోవడంతో గుంతలు ప్రమాదకరంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పశువుల వాహనం పేరిట వసూళ్లపై ఆరా..!

స్పందనకు వందనం

కోదాడ, న్యూస్‌టుడే: డివిజన్‌లోని ఓ పట్టణంలో ఇటీవల పోలీసులు రాత్రి సమయంలో గస్తీ కాసే సమయంలో పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని, వారితో బేరసారాలు కుదుర్చుకొని, అనంతరం వ్యాపారుల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఈ నెల 24 'పశువుల వాహనం పేరిట వసూళ్లు..!' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచి పోలీసులు విచారణ చేపట్టారు. పశువుల వాహనాన్ని అదుపులోకి తీసుకున్న సమయంలో ఎవరెవరు విధుల్లో ఉన్నారు. వసూళ్లకు పాల్పడ్డ సొమ్ము ఎంత అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పశువుల వాహనం కోలకతాకు వెళ్తుండగా వ్యాపారుల మధ్య విభేదాలతో ఈ దందా బయటకు వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. త్వరలోనే విచారణ పూర్తి చేసి బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

అర్హత కలిగిన గ్రంథాలయాలను డిజిటలైజ్ చేస్తాం

కోదాడ, న్యూస్‌టుడే: జిల్లాలో అర్హత కలిగిన ప్రతి గ్రంథాలయాన్ని డిజిటలైజేషన్ చేస్తామని గురువారం జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. జిల్లా ఛైర్మన్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించడంతో కోదాడ పుర వైస్ ఛైర్మన్ కోటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాబాబు, కౌన్సిలర్లు పట్టణంలో ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చదివే అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలు, స్టడీ ఛైర్లు, తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యాదగిరి, కోటిరెడ్డి, షాబుద్దీన్, సుబ్బారావు, రమా, నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వంగవీటి రామారావును సన్మానిస్తున్న పుర వైస్ ఛైర్మన్ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు

ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ. 52 లక్షలు మంజూరు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ. 52 లక్షలు మంజూరయ్యాయి. నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముస్లింల కోరిక మేరకు ప్రహరీ నిర్మాణానికి, అంతర్గత రహదారులకు రూ.52 లక్షలు టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరు చేశారు. ముస్లిం నాయకులు ఎండీ అజీజ్‌పాషా, హాజీ మజీద్ ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, పురపాలక ఛైర్‌పర్సన్ గెల్లి అర్చనకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తారని వారు తెలిపారు.

శిరస్త్రాణం లేకుండా వాహనం నడిపితే చర్యలే

కోదాడ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం లేకుండా వాహనం నడిపితే చలానాలు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ అన్నారు. గురువారం పట్టణంలో రహదారుల మీద హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న వాహనదారులకు అవగాహన కల్పించారు. ఇతరులకు, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, వాహనాలకు సంబంధించిన పత్రాలు తమ వెంట ఉంచుకోవాలన్నారు. ఏఎస్సై సీఎస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లా అండర్-14 బ్లూ క్రికెట్ జట్టుకు కోదాడలోని తేజ పాఠశాలకు చెందిన ఎస్.కె. ఆయాజ్ ఎంపికయ్యాడని పాఠశాల కార్యదర్శి సంతోష్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు సోమనాయక్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబర్చాలన్నారు. ఉపాధ్యాయులు అప్పారావు, రామమూర్తి, పీఈటీ రాంబాబు, రేణుక, వెంకటేశ్వర్లు అభినందించారు.



ఆయాజ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సోమనాయక్, తదితరులు

రూ.500 కోసం మహిళ హత్య.. నిందితుడికి యావజ్జీవం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: రూ.ఐదొందల కోసం ఓ మహిళను హత్య చేసిన నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు, రూ.10,000 జరిమానా విధించింది. అదనపు పీపీ రఘు కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన షేక్ బడేమియా(25) రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఠాణాల పరిధిలో నిందితుడిగా ఉన్నాడు. అతడు 2021 నవంబరు 12న హయత్‌నగర్‌లోని ఓ మద్యం దుకాణం ముందు గుర్తు తెలియని మహిళ(30-35) ఒంటరిగా ఉండడం గమనించాడు. ఆమె దగ్గర కొంత నగదు ఉన్నట్లు గుర్తించిన బడేమియా దానిని తస్కరించాలని అనుకున్నాడు. మహిళకు మద్యం ఆశ చూపి పెద్దఅంబర్‌పేట సమీపంలోని నిర్జన ప్రదేశంలోని కాలువ దగ్గరకు తీసుకెళ్లి పూటుగా మద్యం తాగించాడు. అనంతరం ఆమెను హత్య చేసి రూ.500 దొంగిలించి శవాన్ని కాలువలోకి తోసేసి పారిపోయాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి శతవిధాల ప్రయత్నించినా హతురాలి వివరాలు లభ్యం కాలేదు. ఈ తరహా నేరానికి పాల్పడి నిందితుడు 2021 డిసెంబరులో నల్గొండజిల్లా చింతపల్లి పోలీసులకు చిక్కాడు. పోలీసుల విచారణలో గుర్తు తెలియని మహిళను హత్య చేసిన సంగతి అంగీకరించాడు. దీంతో అతడిని పీటీ వారెంటుపై తీసుకొచ్చి విచారించి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. కేసు విచారించిన రంగారెడ్డిజిల్లా 9వ అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హరీశ గురువారం తుది తీర్పు వెల్లడించారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు అవ్వండి

మునగాల, న్యూస్‌టుడే: రక్తదానం చేయండి.. ప్రాణదాతలు అవ్వండని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో గురువారం పోలీస్ కళాబృందంతో రక్తదానంపై అవగాహన కల్పించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువకులు జిల్లా కేంద్రంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మునగాలలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాబృందం

హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పోలీస్ కళా బృందం గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. పోలీసుల సేవలను, సైబర్ క్రైమ్ తదితర అంశాల గురించి కళాకారులు ఆటపాటల ద్వారా వివరించారు.



హుజూర్‌నగర్‌లో ...

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: వినోం ది లాస్ట్ డ్యాన్స్. **శ్రీనివాస:** దేవర, **కాంప్లెక్స్:** లగ్నం, **రంగా:** పొట్టేల్, **వెంకటేశ్వర:** రాధేకృష్ణ

పత్రికా ప్రకటన

గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి గారి న్యాయస్థానము, హుజూర్‌నగర్

ఓ.యస్.నెం. 215/2019

మధ్య:

శ్రీ సోమా సుగుణ, భర్త: అచ్చయ్య, నివాసం: హుజూర్‌నగర్ ...వాది

మరియు

1. కీ॥శే॥ బర్మావత్ వస్రాం చనిపోయినందున వారి వారసులు
2. బర్మావత్ చంద్రశేఖర్, తండ్రి: లేట్ వస్రాం, నివాసం ఇంటి నెం. 1-1-95, A Block, Sri Krupa Apartments, Road No.1, Srungeri Colony, Mohannagar, Kothapeta, Dilsukhnagar, Hyderabad.
3. భూక్యా కళావతి, భర్త: మంగీలాల్ నాయక్, నివాసం: ఇంటి నెం. 1-20/1, ఇందిరానగర్, సూర్యాభవన్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, హైద్రాబాద్.
4. బర్మావత్ రాజశేఖర్, తండ్రి: లేట్ వస్రాం, నివాసం: ఇంటి నెం. 1-116-61/1, బాలాజీనగర్, కోదాడ టౌన్, సూర్యాపేట జిల్లా.

.. ప్రతివాదులు

పైన తెలిపిన ప్రతివాదులకు ఓ.యస్.నెం. 215/2019 నందు ఎన్నిమార్లు కోర్టు సమన్లు పంపినను తిరిగి వచ్చుచున్నవి. కోర్టు నందు ఐ.ఎ.నెం. 765/2024 ద్వారా పత్రికా ప్రచురణకు అనుమతి పొందినందున తరువాత వాయిదా ది.23-11-2024వ రోజున కలదు. ఆ రోజుకు మీరు కాని, లేదా మీ న్యాయవాది ద్వారా గాని సదరు కోర్టు నందు హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షముగా కేసు విచారణ చేయబడును. కావున తెలియపర్చనైనది.

// కోర్టు వారి అనుమతితో//

సం/- జుట్టుకొండ సత్యనారాయణ,
వాది తరపున న్యాయవాది.
హుజూర్‌నగర్, సెల్ నెం. 98481 25480

హుజూర్‌నగర్
తేదీ: 24-10-2024

సంక్షిప్త సమాచారం

కాలనీలో తాగునీటి ఇబ్బందులు.. నడిగూడెం: కేఆర్సీపురం రెండు పడక గదుల ఇళ్ల కాలనీలో వారం రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఎన్నిక.. నడిగూడెం: పేద ప్రజల హక్కుల సాధనకు సీపీఎం నిరంతరం పోరాడుతుందని పార్టీ మండల కార్యదర్శి బి.సత్యనారాయణ అన్నారు. గురువారం చెన్నకేశవాపురంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. గ్రామశాఖ కార్యదర్శిగా పి.విజయ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గరిడేపల్లి: బీసీ సంక్షేమ సంఘ యువజన విభాగం అధ్యక్షుడిగా జానకి రామాచారిని నియమిస్తున్నట్టు సంఘం జిల్లా కమిటీ కన్వీనరు ధూళిపాల ధనుంజయనాయుడు గురువారం తెలిపారు.

మునగాల: మాస్టిన్ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడిగా నాగేల్లి ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పొన్నాల అంజి, ప్రధాన కార్యదర్శిగా దర్శనం గోపి, సలహాదారుడిగా దర్శనం వెంకన్నలను మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం సీపీఎం కార్యదర్శిగా ముకుందాపురం గ్రామానికి చెందిన సిరికొండ శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ పార్టీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

పంపిణీ.. నేరేడుచర్ల: పాలకవీడు మండలం గుండెబోయినగూడేనికి చెందిన ముండ్ల సతీష్‌కు రూ.60 వేలు, గుండ్లపహాడ్‌కి చెందిన సాయమ్మకు మంజూరైన రూ.60 వేల చెక్కులను గురువారం మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్ వారికి అందజేశారు. నేరేడుచర్ల పురపాలిక పరిధిలోని రామాపురానికి చెందిన నాగమల్ల శ్రీనుకు మంజూరైన రూ.60 వేల చెక్కును పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి అందించారు.

సన్మానం.. మునగాల: మండల ఇన్‌ఛార్జి ఎంఈవోగా విధులు నిర్వహించి, ప్రస్తుతం కోదాడ ఏఈవో విధులు నిర్వహిస్తున్న ఎండీ.సలీంషరీఫ్‌కు, మండల ఎంఎన్‌వోగా విధులు నిర్వహించి బదిలీపై నారాయణగూడెం జడ్పీహెచ్ఎస్‌కు వెళ్లిన సీతారామరాజుకు వీడ్కోలు, ప్రస్తుతం మండల విద్యాశాఖాధికారిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన పిడతల వెంకటేశ్వర్లుకి ఎంఈవో కార్యాలయ సిబ్బంది సన్మానం నిర్వహించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాంబాబు, సీఆర్పీలు రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

★ **హుజూర్‌నగర్:** డీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ సెక్రటరీ ఫోరం అధ్యక్షుడు పిడమర్తి ఇంద్రబాబును సన్మానించారు. పట్టణానికి చెందిన ఇంద్రబాబు జిల్లా ఫోరం అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ట్రస్టు ఛైర్మన్ బాబూరావు, అరుణ్, నరసింహారావు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

అభినందన.. నడిగూడెం: తమిళనాడులో ఈనెల 30న జరగబోయే సౌత్‌జోన్ కబడ్డీ పోటీల్లో నడిగూడెం గ్రామానికి చెందిన మేకల సాయి ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని కాంగ్రెస్‌పార్టీ మండల కార్యదర్శి వి.సుధీర్ గురువారం నడిగూడెంలో సత్కరించారు. నాగేశ్వరరావు, ప్రకాష్, కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రశంస.. గరిడేపల్లి: స్థానిక మోడల్ స్కూల్ పీఈటీ దండెం రవికుమార్ కలెక్టరేట్‌లో గురువారం ఇచ్చిన ప్రదర్శనను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేషంలు ప్రశంసించినట్టు రవికుమార్ తెలిపారు.

అందజేత.. హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణంలోని జిప్సీ చిల్డ్రన్ హోమ్‌లోని విద్యార్థులకు కాచవారిగూడెం గ్రామానికి చెందిన సిరికొండ లక్ష్మీనారాయణ, సావిత్రి దంపతుల రెండో కుమారుడు ఉమేస పుట్టిన రోజు సందర్భంగా బుధవారం రాత్రి అల్పాహారాన్ని అందజేశారు.

మేళ్లచెరువు: చిన్నతనం నుంచే విద్యలో రాణించాలని జువారి సిమెంట్స్ ప్లాంటు హెడ్ జీఎస్‌బీ రావు అన్నారు. రామాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు కంప్యూటరు, ప్రింటరును గురువారం అందజేసి మాట్లాడారు. హెచ్ఎం రాములు, హెచ్ఆర్ హెడ్ పద్మా సింగ్ పాటిల్, సీఎస్ఆర్ సీనియరు మేనేజరు కరణం పిళ్లై పాల్గొన్నారు.

సాయం.. నడిగూడెం: ఇటీవల గుండెపోటులో మృతి చెందిన శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బండారు గురవయ్య కుటుంబానికి భారాస నాయకుడు బెజవాడ శ్రావణ్ రూ.20 వేల నగదును గురువారం మృతుడి కుటుంబానికి అందజేశారు.

నివాళి.. హుజూర్‌నగర్ గ్రామీణం: సామాజిక కార్యకర్తగా, డీలర్‌గా బొమ్మగాని శ్రీను సేవలు మరువలేనివని పలువురు నాయకులు అన్నారు. లక్కవరంలో గురువారం జరిగిన శ్రీను సంతాప కార్యక్రమంలో మాట్లాడారు. శ్రీను చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గురుపాదం, గోదాం ఇన్‌ఛార్జి లక్ష్మణ్ నాయక్, కాంట్రాక్టర్ సంతోష్, డీలర్ల సంఘం నాయకులు లింగయ్య, ధనమూర్తి, అజ్మతుల్లా, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి సమాఖ్య కృషి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. పట్టణంలో సమాఖ్య సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. మహిళలపై అకృత్యాలను నిరోధించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మహిళలకు ఉన్న హక్కులు ఆచరణలో కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను చైతన్య పరిచేందుకు సమాఖ్య నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. సమాఖ్య పట్టణ కార్యదర్శి ఉమా, సీపీఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సావిత్రి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

'మూసీ'పై మాట్లాడే నైతికహక్కు వారికి లేదు: ఎమ్మెల్యే సామేల్

హైదరాబాద్: మూసీ నది గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్, హరీశ్‌రావులకు లేదని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం ఆయన అసెంబ్లీలోని సీఎల్పీ మీడియా హాల్‌లో మాట్లాడారు. భారాస హయాంలోనే మూసీ పునరుజ్జీవం గురించి జీఓ తెచ్చి, ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎవరు అడ్డుపడినా మూసీ పునరుజ్జీవం ఆగదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై మాట్లాడే స్థాయి భారాస నేత, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు లేదన్నారు. మరోసారి వారి గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే జాగ్రత్త అంటూ హెచ్చరించారు.

ఆర్టీసీ కార్మికుల దాతృత్వం అభినందనీయం

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: ఉద్యోగ బాధ్యతతో పాటు సహచరులు మరణిస్తే వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్ అన్నారు. ఇటీవల మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు సూర్యాపేట డిపోలో గురువారం కార్మికుల ద్వారా ఆర్థికసాయం అందజేశారు. సూర్యాపేట ఆర్టీసీ కార్మికులందరూ కలిసి ఒక్కటై రూ. 1.60లక్షలను సేకరించి ఇటీవల మరణించిన అద్దె బస్సు డ్రైవర్ శ్రీను కుటుంబానికి రూ.75 వేలు, వీరస్వామి కుటుంబానికి రూ.36 వేలు, కండక్టర్ ప్రకాశ్ కుటుంబానికి రూ.45 వేలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బి.సైదులు, పుల్లయ్య, బత్తుల సుధాకర్, ఎస్.ఎస్.గౌడ్, నాగేశ్వరరావు, హరీష్, మనీ, శ్రీకంఠ, పవన్, జానిరెడ్డి, చారి పాల్గొన్నారు.


సూర్యాపేట ఆర్టీసీ డిపోలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న సిబ్బంది

రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నిక

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన ఐద్వా రాష్ట్ర మహాసభలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మద్దెల జ్యోతి, మేకనబోయిన సైదమ్మ, జూలకంటి విజయలక్ష్మి ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు గురువారం ఒక ప్రకటనలో వారు తెలిపారు.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని ఎన్టీఆర్ పార్కు వద్ద రహదారిపై గుంతపడింది. వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – సునీల్, సూర్యాపేట

✔ గుంత పూడ్చి ఇబ్బందులు లేకుండా చూస్తాం. – యుగేందర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని జి.కె.గార్డెన్ కాలనీలో మురుగు కాల్వలు నిర్మాణానికి నోచుకోలేదు. ఇళ్లలోని వ్యర్థాలు ఖాళీ స్థలాల్లో నిలుస్తోంది. దుర్గంధం వ్యాపిస్తోంది. – విజయ్, జి.కె.గార్డెన్ కాలనీ

✔ నిధుల లభ్యతను బట్టి నిర్మాణం చేపడతాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ఆర్థిక స్వావలంబనకు అడుగేసి..

రైతులకు మద్దతుగా నిలిచి

పిల్లలమర్రి (సూర్యాపేట పురపాలిక), న్యూస్‌టుడే:

'సూర్యాపేట మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటైన మహిళా స్వయం సహాయ సంఘాలు ధాన్యం కొనుగోళ్లు చేపడుతూ.. అన్నదాతలకు మద్దతు ధర కల్పనకు కృషి చేస్తున్నాయి. 2021 నుంచి మూడేళ్లుగా విజయవంతంగా కొనుగోలు కేంద్రాలు నిర్వహించి అతివలు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి లక్ష్యం మేర ధాన్యం సేకరిస్తున్నారు.'


కుసుమవారిగూడెంలో మెప్మా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్.లత(పాతచిత్రం)

13 కేంద్రాల ఏర్పాటు

సూర్యాపేట పురపాలిక పరిధిలోని మెప్మా మహిళా స్వయం సహాయక సంఘాలకు అధికారులు 13 కేంద్రాలు కేటాయించారు. పిల్లలమర్రి, బీబీగూడెం, కుడకుడలో రెండు చొప్పున, రాయినిగూడెం, కుప్పిరెడ్డిగూడెం, కుసుమవారిగూడెం, దాసాయిగూడెం, రాంకోటితండా, దుబ్బతండాలో ఒకటి చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు వీటిని ప్రారంభించారు. ఆయా కేంద్రాల బాధ్యతలను మహిళా సంఘం అధ్యక్షురాళ్లు, సభ్యులు భుజాన్నెత్తుకొని నిర్వహణ చేపట్టి కొనుగోళ్లు చేపడుతున్నారు. ఒక్కో కేంద్రం పరిధిలో రైతులు విక్రయించుకునేలా ఏర్పాట్లు చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసేలా చర్యలు తీసుకోనున్నారు.

ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు



– సునీత, కుసుమారిగూడెం ఏఎల్ఎఫ్, మహిళా సంఘం అధ్యక్షురాలు

మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాల బాధ్యత అప్పగించినందుకు సంతోషంగా ఉంది. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపడుతున్నాం. ఇప్పటి వరకు మూడు సార్లు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు చేపట్టాం. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు మేరకు కేంద్రాలను నిర్వహించి ప్రభుత్వానికి సహకరిస్తున్నాం.

ఉపాధికి ఊతం



– చెరుకుపల్లి ఉప్పమ్మ, కుప్పిరెడ్డిగూడెం ఏఎల్ఎఫ్, మహిళా సంఘం అధ్యక్షురాలు

మెప్మా ఆధ్వర్యంలో నాలుగోసారి కొనుగోలు కేంద్రాల నిర్వహణ చేపడుతున్నాం. ఏడుగురు మహిళా సంఘ సభ్యులం కలిసి రైతుల ధాన్యాన్ని కాంటా వేయిస్తున్నాం. కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం కమీషన్ ఇవ్వడంతో మాకు ఉపాధి లభించినట్లయ్యింది.

నీటిట్యాంకు పరిశుభ్రం

స్పందనకు వందనం

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరి పురపాలిక పరిధిలో 11వ వార్డులో ముత్యాలమ్మ దేవాలయం వద్ద పాకురుపట్టిన నీటిట్యాంకు అపరిశుభ్రంగా ఉంది. 'పాకురుపట్టిన నీటి ట్యాంకు' శీర్షికన ఈనెల 24న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పుర కమిషనర్ ఎం.బుచ్చిబాబు స్పందించారు. వెంటనే సిబ్బందిని పంపించి బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించారు.

మంత్రిని విమర్శించే స్థాయి లేదు

నాగారం, మద్దిరాల, జాజిరెడ్డిగూడెం, నూతనకల్, న్యూస్‌టుడే: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు లేదని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మద్దిరాల మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు మర్రి కృష్ణమూర్తి, రేఖా చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ బోయపల్లి రేఖ, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపెల్లి మధుకర్ రెడ్డి, జాజిరెడ్డిగూడెం మండల ఉపాధ్యక్షుడు దాసరి సోమయ్య, నూతనకల్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. నాగారం(బంగ్లా), మద్దిరాల, అర్వపల్లి, నూతనకల్‌లో గురువారం వేర్వేరుగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ నాగారం మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య యాదవ్, నాయకులు పానుగంటి నర్సింహారెడ్డి, పసుపులేటి వెంకటరెడ్డి, ఉపేందర్, కాశయ్య, అనిల్, కృష్ణమూర్తి, బద్ధం యాదగిరి, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగం జయసుధ, తీగల గిరిధర్‌రెడ్డి, కట్ట మల్లారెడ్డి, తొన్నూరి సైదులు పాల్గొన్నారు.

పత్తి రైతుల సమస్యలు పరిష్కరించండి

☛ గవర్నర్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వినతి


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి విలేకరుతో మాట్లాడుతూ రాష్ట్రంలో పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఈ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి పరిష్కరించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వరదల్లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోలేదని, ఎక్కడా ఒక్క రూపాయి సాయం అందించలేదని ఆరోపించారు. కనీసం నష్టాన్ని అంచనా వేసే ప్రయత్నం చేయలేదన్నారు.

☛ పత్తి రైతులపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని ధ్వజమెత్తారు. గుజరాత్ రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా పత్తి రైతులకు రూ. 8,257 మద్దతు ధరను తెలంగాణలోనూ అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ. 475 బోనస్‌నూ ఇప్పించాలని కోరారు.

☛ అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 30 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గురువారం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పంపిణీ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ.. పెన్‌పహాడ్: మండలంలోని వివిధ గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. నారాయణగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నారాయణ రాఘవరెడ్డి కుటుంబాన్ని, పెన్‌పహాడ్, నాగులపహాడ్ గ్రామాల్లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న భారాస నాయకులు తూముల ఇంద్రసేనారావు, కందుకూరి పాండురంగయ్య, కొండ జానకిరాములను మాజీ మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో భారాస మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ ఛైర్మన్లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, మండలి మల్లయ్య, జీడి భిక్షం, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, భైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండలి కృష్ణ, మామిడి అంజయ్య పాల్గొన్నారు.

ప్రజాస్వామిక వాదుల గొంతునొక్కడం సరికాదు


కుడకుడ లెనిన్‌నగర్‌లో మాట్లాడుతున్న కారింగుల వెంకన్న

చివ్వెంల, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూర్యాపేట జిల్లాకు రాగా ప్రజా సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు సమాయత్తమైన తమ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సబబు కాదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని కుడకుడ లెనిన్‌నగర్‌లో గురువారం ఆ పార్టీ సమావేశంలో మాట్లాడారు. మోతె మండలం రావిపహాడ్‌లో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమతో హానీ జరుగనుందని తెలిపారు. పరిశ్రమ నిర్మిస్తే పర్యావరణంతో పాటు పంట భూములకు నష్టం జరిగి బీడు భూములుగా మారతాయని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా వినతి పత్రం అందించేందుకు సిద్ధమైన జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఇలా అక్రమ అరెస్టులతో ప్రజాస్వామిక వాదుల గొంతు నొక్కడం సరికాదన్నారు. నాయకులు ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, పిడమర్తి లింగయ్య, గులాం హుస్సేన్, చంద్రకళ, సంతోషి మాత, జయమ్మ, మోహన్, పద్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

భానుపురి, న్యూస్‌టుడే: గుండెపోటుతో మృతిచెందిన ట్రాక్టర్ మెకానిక్ చేపూరి పరిపూర్ణాచారి(51) కుటుంబ సభ్యులకు గురువారం మెకానిక్ అసోసియేషన్ సభ్యులు రూ. 1.60 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. సభ్యులు రాందేని ఆదినారాయణ, అక్బర్, పల్సా మహేష్, అనిల్, యూసుఫ్, రాయపాటి శ్రీను, కుంచారపు నాగిరెడ్డి, బంధనాథం రాజు పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రాక్టర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

చర్యలు తీసుకోవాలని నిరసన

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జాజిరెడ్డిగూడెం ఎంపీడీవో పవన్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ కార్యాలయం, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్స్ గురువారం అర్వపల్లిలోని ఆ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రధానంగా మహిళా ఉద్యోగులపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. వీడియో కాల్ చేయాలని, లేకుంటే ఇబ్బందులు పెడతానని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఎంపీడీవో విధుల్లో ఇలాగే కొనసాగితే మూకుమ్మడిగా సెలవు పెడతామని, ఆయన వేధింపులు భరించలేమని అర్వపల్లిలో జడ్పీ డిప్యూటీ సీఈవో శిరీషకు వినతి పత్రం అందజేశారు. నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపిస్తానని ఆమె చెప్పారు.


అర్వపల్లిలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్యాలయ సిబ్బంది

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

హరితహారంలో మొక్కలను మండల వ్యాప్తంగా రోడ్డుకు ఇరువైపుల నాటారు. మండలంలోని ముకుందాపురం నుంచి చిన్న నెమిల వెళ్లే పంచాయతీ రోడ్డు వెంట చెట్లను నాటడంతో అవి ఏపుగా పెరిగి విద్యుత్తు తీగలకు అడ్డంకిగా మారాయి. దీంతో విద్యుత్తు శాఖ అధికారులు సిబ్బందితో వాటిని తొలగింపజేస్తున్నారు. మొక్కలు నాటే ప్రక్రియలోనే విద్యుత్తు తీగలకు దూరంగా నాటితే చెట్లను తొలగించాల్సిన అవసరం ఉండేది కాదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత విద్యుత్తుశాఖ ఏఈ సురేందర్‌ను వివరణ కోరగా విద్యుత్తు తీగలకు చెట్ల కొమ్మలు తగిలి తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, దీంతో తొలగించాల్సి వస్తుందన్నారు. – న్యూస్‌టుడే, మద్దిరాల



కొమ్మలు పెరిగి.. ప్రమాదకరంగా మారి..!



పట్టణంలోని గణేశ్ నగర్ పట్టణ నిరాశ్రయుల కేంద్రం వద్ద పార్కులో ఏపుగా పెరిగిన చెట్టు విద్యుత్తు తీగలపైకి చొచ్చుకు వచ్చాయి. గాలి వీసినప్పుడు విద్యుత్తు స్తంభం అటుఇటు కదులుతుండటంతో ఎక్కడ కూలుతుందోనని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్తు తీగలకు ఆనుకొని ఉన్న చెట్టు కొమ్మలను నరికి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. పట్టణ విద్యుత్తు శాఖ టౌన్- 2 ఏఈ యశ్వంత్‌ని వివరణ కోరగా సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే:

విద్యుత్తు వెలుగులున్నా.. చీకటే



తిరుమలగిరి, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని 13వ వార్డులోని అంబేద్కర్ నగర్‌లో ముత్యాలమ్మ ఆలయం వద్ద విద్యుత్తు స్తంభానికి సమీపంలో వేపచెట్టు కొమ్మలు పెరిగాయి. కొమ్మలు కరెంటు తీగలకు తగలుతున్నాయి. స్తంభంపై నున్న విద్యుత్ దీపం చుట్టూ అల్లుకున్నాయి. దీంతో రాత్రి విద్యుత్తు దీపం వెలుగులు రోడ్డుపైన పడటం లేదని, చీకటిగా ఉంటోందని కాలనీ వాసులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాగుల పంపిణీ

నూతనకల్, న్యూస్‌టుడే: వెంకేపల్లి గ్రామానికి చెందిన శనిగల యాదగిరి తాళ్లసింగారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ పొందారు. తన కుమారుడు చైతన్యప్రసాద్ జ్ఞాపకార్థం వెంకేపల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం భార్య పద్మతో కలిసి బ్యాగులు అందించారు. ఆ గ్రామానికి చెందిన సుమారు 200 మంది విద్యార్థులకు బ్యాగులు అందించడం అభినందనీయమని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, నెల్సన్‌లు తెలిపారు. కార్యక్రమంలో శనిగల రామచంద్రయ్య, శ్రీను, శ్రీధర్ పాల్గొన్నారు.


వెంకేపల్లిలో విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శనిగల యాదగిరి, పద్మ దంపతులు

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సామ అంజిరెడ్డి, కోతి మధవి అన్నారు. గురువారం తిరుమలగిరిలో మండల ఉద్యమకారుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమకారుల కుటుంబాలకు ఉచిత కార్పొరేట్ విద్యా, వైద్యం, బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో కొత్తగట్టు యాకయ్య, అబ్దుల్ గఫార్‌ఖాన్, రహమాన్, ఏసిరెడ్డి, గడ్డం ఉదయ్, యాదగిరి, నర్సయ్య, సోమయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన గురువారం సూర్యాపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని విజయకాలనీకి చెందిన మహంకాళి కోటేశ్వరరావు(40) తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 20న శాంతినగర్ నుంచి తన నివాసానికి నడుచుకుంటూ వెళ్తుండగా జాతీయ రహదారిపై వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కోటేశ్వరరావును చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ కేసు నమోదు చేశారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3029	1872
జైశ్రీరాం	3159	1706
ఐఆర్-64	1989	1760
హెచ్‌ఎంటీ	2808	1769
కందులు	8141	8141
పెసర	6796	5846
వేరుసెనగ	4669	3699
మినుములు	4446	2312

సమస్యల వలయంలో వసతి గృహాలు


ఆత్మకూర్(ఎస్) ఎస్సీ బాలుర వసతిగృహంలో కాలం చెల్లిన విద్యార్థుల పరుపులు

సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్‌లోని వసతి గృహాలను 'న్యూస్‌టుడే' గురువారం సందర్శించగా.. అక్కడి విద్యార్థులు పలు సమస్యలు తెలిపారు.

పరిశీలన

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. చుట్టూ కంపచెట్లు, చెత్తాచెదారం ఉండటంతో విద్యాసంవత్సరం ఆరంభంలో శ్యామకుమార్ అనే ఏడో తరగతి బాలుడు విషపురుగు కాటుకు గురై మృతిచెందారు. అప్పటి నుంచి వసతిగృహంలో విద్యుత్తు సౌకర్యాన్ని మెరుగుపరిచినా ఇంకా సమకూర్చాల్సిన సౌకర్యాలు చాలానే ఉన్నాయి. నీటి శుద్ధికేంద్ర లేక తాగునీటిని కొనుక్కోవాల్సి వస్తోంది. విద్యార్థులు గదుల్లో పడుకునేందుకు గతంలో ఇచ్చిన పరుపులు పూర్తిగా పాడయిపోయాయి. కిందనే నిద్రించాల్సిన పరిస్థితి నెలకొంది. దర్వాజ తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. రాత్రివేళ దోమల బెడద తప్పడంలేదు. చలికాలం సమీపిస్తున్న నేపథ్యంలో వసతిగృహంలో చల్లటినీరే విద్యార్థులకు దిక్కుగా మారింది.

మూలకుచేరిన నీటిశుద్ధి యంత్రం


పెన్‌పహాడ్ బీసీ హాస్టల్‌లో నిరుపయోగంగా నీటిశుద్ధి యంత్రం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో పలు సమస్యలు నెలకొన్నాయి. నీటిశుద్ధి యంత్రం చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ప్రైవేటు ప్లాంటు నుంచి తాగునీరు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు మూడు మాత్రమే ఉన్నాయి. 65 మంది విద్యార్థులకు అవి సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. అదనంగా మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. 'ఆయా సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామ'ని వార్డెన్ భుజంగం చెప్పారు.

ప్రతిపాదనలు పంపాం

– రవికుమార్, వసతిగృహ అధికారి, ఆత్మకూర్(ఎస్)

తాగునీటి శుద్ధి కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. పరుపులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. తలుపులు, కిటికీలు, తదితర మరమ్మతుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

శుద్ధమైన తాగునీటితోనే ప్రజలకు ఆరోగ్యం: ఎస్ఈ

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: పరిశుభ్రమైన తాగునీటితోనే ప్రజల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని గ్రామీణ తాగునీటి విభాగం ఎస్ఈ వెంకటేశ్వర్లు అన్నారు. ఆత్మకూర్(ఎస్) మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మంచినీటి సహాయకుల శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న ప్రమాణాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. అనంతరం వివిధ గ్రామాల తాగునీటి సహాయకులకు శిక్షణ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరావు, డీఈ పాండు, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ అరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో హంసీ, ఎంపీవో రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్, ల్యాబ్ కెమిస్ట్ పరశురాములు, అఖిల్‌అహ్మద్, ముత్తయ్య పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం.. తుంగతుర్తి: గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఆలోచనతో ప్రభుత్వం నీటి సరఫరా సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసింది. గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో నీటి నాణ్యత, నిర్వహణ, క్లోరినేషన్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. చివరి రోజున వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.


ఆత్మకూర్(ఎస్)లో మంచినీటి సహాయకులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న గ్రామీణ తాగునీటి విభాగం ఎస్ఈ వెంకటేశ్వర్లు, తదితరులు

కార్యక్రమంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈలు శ్రీనివాస్, అరుణాకర్‌రెడ్డి, డీఈ అజయ్, ఏఈలు జాన్‌ఫ్రెడ్, చందన, అశోక్ పాల్గొన్నారు.